



అమావాస్య, అర్థరాత్రి, దొడ్డి వాకిలి మెల్లగా తెరిచాను. ఎక్కడా నరసంచారము లేదు. కుక్కలు దూరంగా మొరుగుతున్నాయి. మెల్లగా బయటపడ్డాను. స్వేచ్ఛావాయువులు గట్టిగా పీల్చాను.

ఒక్కసారి వెనక్కి తిరిగి యింటివైపు చూశాను. ఒకవైపు దుఃఖం, ఒకవైపు సంతోషం కల్గాయి. మా పవిత్ర దేవాలయాన్ని విడిచి వెళ్ళుతున్నందుకు, అమానుషుల హస్తాల్లోంచి బయటపడుతున్నందుకు, కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

బిగ్గరగా ఏడ్వాలనిపించినా, నాలోనే దిగమింగుకుని, కర్తవ్యం గుర్తు చేసుకుని, చీకటిలో అడుగులు ముందుకు వేశాను.

ఎలా నడిచానో నాకే తెలియదు. రైల్వేస్టేషను చేరుకున్నాను, మద్రాసు మెయిల్ ఆగి ఉంది. టిక్కెట్టు తీసుకుని రైలెక్కాను. రైలు నిండా జనం. ఎలాగో స్థలం చూసుకుని, ఒక మూల కూర్చున్నాను.

కాలం ఆగదన్నట్లు రైలు ముందుకు సాగింది. మనసంతా బరువుతో నిండి, కళ్ళలోనే దుఃఖం యింకిపోయింది.

రైలు కుదుపులకు, శరీరంతో పాటు, మనసు కదిలి, నా జీవితం ఒక్కసారి రైలు చక్రాలలా తిరిగింది.

పుట్టుకతోనే గుండె జబ్బు కలవాడిని. దానికోసం ఎన్నో విధాల చికిత్స అయింది. తిన్న మందులు ఎందుకూ పనికిరాలేదు.

ఆయాసం, కాళ్ళవాపు, దగ్గు, బలహీనత మొదలగు లక్షణాలతో బాధపడుతుండేవాడిని. బాల్యం, యౌవనం గడిచింది. అనారోగ్యం వలన చదువు మీద శ్రద్ధ వహించలేకపోయాను.

ఎలాగో డిగ్రీ పూర్తయింది. నాన్న చేసే బిజినెస్‌కు, ఈ చదువు చాలనిపించింది, అందుకే బిజినెస్‌లో దిగాను. వ్యవహారాలన్నీ నేర్చుకున్నాను.

అడుగడుగునా గుండెజబ్బు అడ్డుపడేది. డాక్టర్లు చివరకు ఆపరేషన్ చేస్తే నయమవుతుందని తేల్చారు.

ఈ బాధతో జీవితం ముందుకు సాగాలంటే కష్టం అనిపించింది. ఆపరేషన్ తోటి, అటో, యిటో తేల్చుకుంటే మంచిదని నిర్ణయించుకుని, అమ్మా నాన్న నిర్ణయించుకోలేకపోయినా, నేను సరే అన్నాను.

అన్ని సక్రమంగా జరిగి, నా ఆపరేషన్ విజయం అయింది. ఆ క్రొత్త జీవితంలో నాకు రెండు ఆశలు కనుపించాయి.

నా జీవితం యిక పూలబాట అవుతుందని, రెండోది, నా జీవితంలోకి రేఖ ప్రవేశించిందని...

ఆ హాస్పిటల్‌లో రేఖ నర్సుగా పనిచేస్తోంది. అక్కడ ఉన్నంతకాలం నన్ను కంటికి రెప్పలా చూసింది. కళ్ళల్లోని అమాయకత్వం, ముఖంలోని కళ నన్ను ఆకర్షించాయి.

రేఖగురించి చెప్పాలంటే, గ్రంథమంత ఉంది. నాకు మనసుకు నచ్చింది. నా ప్రాణానికి ప్రియమైంది. భాగస్వామిగా చేసుకోవాలనుకున్నాను.

కులాలు, మతాలు, డబ్బు యొక్క తారతమ్యాలు, తల్లిదండ్రుల అయిష్టత, అన్నీ చుట్టుముట్టాయి. ఒక చిన్న తుఫాను చెలరేగింది. పట్టుదలలు, పెద్దతనం హుంకరించింది. మానవత్వం నశించింది.

నాలోని సహనం బద్దలయింది. చెలియలి కట్ట తెగింది. రేఖను నా దాన్నిగా చేసుకున్నాను.

నాలోని మంచితనం, రేఖ అదృష్టం, భగవంతుడి దయవలన తుఫానులో చిక్కుకున్న నావను బయటకు తీసుకొచ్చి, నిలకడ చేసుకున్నాను.

మా జీవితం ఆనందం, మా నడకలు అమృతం. సంసారంలోని సుఖం ప్రపంచంలోని అందాలు మా స్వంతం చేసుకొని, కలసి ముందుకు సాగాం.

మా దురదృష్టమో, విధి వక్రించిందో, నిర్దాక్షిణ్యంగా వెలవేసిన, మానవుల శాపనార్థాలో... ఏమయితేనేం... రేఖ... నాకు సంతానం ప్రసాదించలేకపోయింది. ఆమె అనారోగ్యం అందుకు తోడయింది.

ఆ విషాదఛాయలు మా జీవితంలో అస్తమించే నీడలలా, రోజురోజుకు పెరిగాయి. ఎంత ప్రయత్నించినా రేఖలో సంతోషాన్ని చూడలేకపోయాను.

యిద్దరం ఆలోచించి రేఖ చెల్లెలిని, ఆమె భర్తను, వాళ్ళ బాబును తీసుకొచ్చి, బాబును దత్తత తీసుకున్నాం. రేఖ ముఖంలోని కాంతి చూసి కుదుటబడ్డాను.

మనుషులు దూరంగా ఉంటే మమతలు. అనురాగాలు ఎక్కువ. దగ్గరయితే అవి నశించి, మానవత్వం లేని కసాయి వాళ్ళవుతారు. యిది నిజంగా మా యింట్లో కనుపించింది.

రక్త సంబంధం గల చెల్లెలే అక్కకు ద్రోహం తలపెట్టింది. మా ఆస్తి మీద కన్ను కుట్టింది. యింట్లో పెత్తనం రానురాను ఎక్కువయింది.

మా తర్వాత అంతా వాళ్ళకే, చెందుతుందని తెలిసినా, అంతవరకు ఓపిక పట్టలేము అన్నట్టు ప్రవర్తించేవాళ్ళు.

బాబును దత్తత తీసుకున్నా, పిల్లల మురిపెము, ముచ్చట రేఖకు దక్కనివ్వలేదు. అనుక్షణం, ఆ సేవలకు, ఒక ఖరీదు పెట్టారు.

చెల్లెలి భర్తను నా బిజినెస్‌లోకి దించాను. నా తోడుగా ఉండమని కొన్ని వ్యవహారాలు అప్పగించాను. స్వర్గానికి దారి చూపించినట్లయింది అతనికి.

నన్ను మోసం చేస్తూ, నా పరోక్షంలో నన్ను నలుగురిలో లోకువ చేస్తూ, నన్ను పూర్తిగా నాశనం చేయడానికి పూనాడు.

యింట్లో రేఖ పరిస్థితి అధ్వాన్నమయింది. గిల్లికజ్జాలు, మనస్పర్థలు మొదలగునవి పెరగసాగాయి. ఆస్తి యిచ్చి, ఆశ్రయం యిచ్చి, పోషిస్తున్నా, మా యిద్దరి సమాధులకు రాళ్ళు సిద్ధం చేశారు.

యిక భరించలేక, అనుకున్న ప్రకారం ఏదో కొంత యిచ్చి పీడ విరగడ చేసుకుందామని అనుకున్నాం.

ఆ రోజు కురుక్షేత్ర సంగ్రామం అయింది. యిద్దరం అలిసిపోయ్యాం. మరురోజు తేల్చుకుందామని..

రేఖకు నిద్రలోనే పక్షవాతం వచ్చి, కాలు, చేయి, నోరు పడిపోయింది.

నేను చిన్నాభిన్నమయ్యాను. నాలుగు నెలలు, హాస్పిటల్‌లో గడిపి రేఖ నన్ను వదిలివెళ్లిపోయింది.

వాళ్ళు అనుకున్న విధంగా ఒక సమాధి అయింది. జీవితంలో మిగిలింది శూన్యం. ఎవరికోసం ఈ బ్రతుకు. ఎందుకీ బ్రతుకు అనిపించింది.

దేనికోసము వాళ్ళు కర్కశంగా ఉన్నారో, అదంతా వాళ్ళకే యిచ్చేశాను. నిర్జీవంగా, రోజులు లెక్కపెడుతున్నాను.

ఎండిపోయిన మ్రాను అని అయినా లెక్కచెయ్యక, చేరదీసి, ఆశ్రయం యిచ్చినాడన్న కృతజ్ఞత లేకుండా నన్ను చిత్రహింసలకు గురిచేశారు.

రేఖలేని నిస్సారమైన బ్రతుకు, మానవులు చేసే

**మా తర్వాత అంతా వాళ్ళకే, చెందుతుందని తెలిసినా, అంతవరకు ఓపిక పట్టలేము అన్నట్లు ప్రవర్తించేవాళ్ళు. బాబును దత్తత తీసుకున్నా, పిల్లల మురిపెము, ముచ్చట రేఖకు దక్కనివ్వలేదుఆ సేవలకు, ఒక ఖరీదు పెట్టారు.**



పనులు, నాకు జీవితం మీద విరక్తి పుట్టించాయి.

సమాధి రాళ్ళు సిద్ధం చేసినా, యింకా మొండిఘటం పోలేదని, వాళ్ళకు తోచిన ప్రయోగాలు చేశారు.

నాకే విసిగెత్తి యింట్లోంచి బయటపడ్డాను. గమ్యం తెలియదు. రేఖ రమ్మంటుంది. వెళ్ళిపోవాలి. రైలు వేగంగా పోతుంది. దూకుదామా అనిపించింది.

యింతలో పెద్ద చప్పుడు. ఆకాశం బ్రద్దలయినంత చప్పుడు... రైలు పడిపోలేదు కదా... ఏమవుతుందో...*